మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సోమ, మంగళవారం రెండు రోజులు సెలవు ఉంటుందని వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. బుధ వారం యథావిధిగా మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరుగుతాయని వ్యాపారస్తులు, రైతులు గమ నించాలని నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

కథనం ప్రచురితం.. సమస్య పరిష్కారం



బోరుకు మరమ్మతు చేసిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ పరిధి సంజీవయ్యనగర్‌లో బోరు మోటర్ పాడవడంతో పాటు సింథటిక్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. వీటితో పాటు వివిధ సమస్యలతో స్థానికులు సతమతమయ్యేవారు. ఈ సమస్యలపై ఈ నెల 15న సంజీవయ్యనగర్ బస్తీ.. సమస్యలతో సుస్తీ' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి పాడైన బోర్‌మోటర్‌కు మరమ్మతు, సింథటిక్ వాటర్ ట్యాంకులకు నల్లాలు బిగించారు. బస్తీవాసుల ప్రధానమైన నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి బస్తీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు చేయాలి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ పాస్టర్స్ అప్రిసియేషన్ డే ఘనంగా నిర్వహించారు. మూసారంబాగ్ జీసెస్ కాల్ బిల్డింగ్‌లోని కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల అబ్రాహం మాణిక్యం, ప్రధాన కార్యదర్శి అనితా షిబారాణి పాస్టర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. హైదరాబాద్ చర్చి ఆఫ్ క్రైస్ట్, ఇంటర్‌నేషనల్ స్పీకర్ బీ.ఎన్. జయపాల్ హాజరై బైబిల్ వ్యాకోపదేశం, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఐక్యత ఉంటూ ప్రపంచ శాంతి భద్రతల కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. లూకానందరావు, బోడ సాల్మన్, శాంత్‌కుమార్, క్రిష్టఫర్, యేసు రత్నం, రాజేష్, బ్రదర్స్ సుదర్శన్, నవీన్, వెంకటేష్ నవీన్‌పాల్, భూషణ్, సంసోన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

ఎల్‌బీనగర్: కాలనీ సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. బృందావన్ మేడోస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా కాలనీ సమస్యలపై కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని అన్ని సమస్యలను పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కాలనీలో మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు తెలుపగా ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరలో అధికారులతో కాలనీలో పర్యటించి రోడ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. శశికాం, జగన్‌మోహన్ చారి, వేణు, రవితేజ, రాజు, అరుణ్,రఘుమారెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



చాదర్‌ఘాట్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని నగర బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆజంఅలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలలో ప్రచారంలో పాల్గొన్నప్పుడు మైనారిటీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి విశేష స్పందన వస్తుందన్నారు.

సన్మానం

లింగోజిగూడ: ఇటీవల కర్ణాటక రాష్ట్రం మైసూరులో నిర్వహించిన 50వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారిణీ అరుణ కుమారి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు ఆదివారం అరుణ కుమారిని జిల్లా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అక్టోబర్ 9 నుంచి 12 వరకు మైసూరులో నిర్వహించిన పోటీలో అరుణ 45 సంవత్సరాల గ్రూప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించిందని పేర్కొన్నారు.

ఇద్దరి రిమాండ్



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న సైదాబాద్ పోలీసులు

సైదాబాద్: వేర్వేరు రెండు పోక్సో కేసుల్లోని ఇద్దరిని సైదాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్‌లో ఆరుబయట ఆడుకుంటున్న ఇద్దరు అక్కాచెళ్లెళ్లతో సహా ముగ్గురు మైనర్ బాలికలపై పక్కింట్లో నివసించే రియాజ్ తన ఇంట్లోకి తీసుకెళ్లి పలుమార్లు లైంగికంగా వేధించాడు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసారు.

- పాత పరిచయాన్ని ఆసరాగా చేసుకొని ఇంట్లో ఒంటరిగా ఉంటున్న బాలికపై విజయ్ అపే అనే యువకుడు పలుమార్లు అత్యాచారం చేసాడు. విషయం తెలుసుకున్న బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేయగా ఇరువురిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు.